క్లుప్తంగా

31న విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా ఈ నెల 31న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆపరేషన్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. హరిజన యాదవ జగ్గ రాజుపేట, ఫకీర్‌తక్యా, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నామని పేర్కొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి పండగ



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో కొలువైన బంగారుమాంబ అమ్మవారు, నూకాంబిక అమ్మవారు, దుర్గాలమ్మ అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నూకాంబిక అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గ్రామంలోని భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు. రాత్రికి బంగారుమాంబ ఆలయం వద్ద ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వేసవి శిక్షణా శిబిరాలు, ఉపయోగాలు అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, విజేతలకు శిబిరం ముగింపు రోజు బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివిధ పాటలకు నృత్యాలు చేశారు.

పేద మహిళలు ఆర్థికంగా బలపడాలి



కుట్టుమిషన్ల పంపిణీ ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. కుష్టు, హెచ్ఐవీ బాధితులకు కూడా సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- రోడ్లపైనే ఇష్టారాజ్యంగా భారీ వాహనాల పార్కింగ్
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని పోలీసులు



అక్కిరెడ్డిపాలెం పంప్ హౌస్ పక్కనున్న సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేసిన లారీలు



షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేసిన లారీలు

అక్కిరెడ్డిపాలెం: లారీలు, ట్రక్కులు, భారీ వాహనాలు రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం నుంచి షీలానగర్ పెట్రోల్ బంక్ వైపు సర్వీసు రోడ్డును లారీలు, ఇతర భారీ వాహనాలు ఏకంగా రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు ట్రాన్స్ పోర్టు కార్యాలయాలు ఉండటంతో వాటికి సంబంధించిన



68వ వార్డు రాంనగర్ ఎంపీహెచ్‌సీకు వెళ్లే రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్

టారీలు లోడుతో రోజుల కొద్దీ కార్యాలయం ఎదురుగా సర్వీసు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సర్వీసు రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. నిత్యం ట్రాఫిక్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా..రోజుల తరబడి పార్క్ చేసిన వాహనాలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

షీలానగర్ కిమ్స్ ఐకాన్ రోడ్డులో...

షీలానగర్‌కిమ్స్ ఐకాన్‌కు వెళ్లే రోడ్డులో భారీ వాహనాలు, ట్రక్కులు రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ట్రక్కుల మరమ్మతులు సైతం రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో షీలానగర్, వేంకటేశ్వరకాలనీ వాసులు తమ కార్ల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వచ్చే రోగుల బంధువులు కొన్నిసార్లు రాత్రి సమయంలో ఆస్పత్రికి చేరుకోవడానికి నడచి వెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పార్క్ చేస్తున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



షీలానగర్ కిమ్స్ ఐకాన్ రోడ్డుపై పార్కింగ్ చేసిన ట్రక్కులు

ఎంపీహెచ్‌సీకు వెళ్లే రోడ్డును ఆక్రమించి..

జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లోని ఎంపీహెచ్‌సీకు వెళ్లే రోడ్డుపై భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో అంబులెన్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొద్ది రోజులుగా రాంనగర్ ఏ – బ్లాక్‌లోని గోదామునకు వచ్చే భారీ వాహనాలు రోజుల కొద్ది రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



శిక్షణకు హాజరైన ఎండీఎంలు, ఉపాధ్యాయులు తదితరులు



వంటల పోటీల్లో నిమగ్నమైన ఎండీఎంలు

పెదగంట్యాడ: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ ఏవీ సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖాధికారి సూచనలతో మండల విద్యా శాఖాధికారి కంకటాల రమణాజీ అధ్యక్షతన నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల మహిళలకు మధ్యాహ్న భోజనం నిర్వహణపై మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 12న పాఠశాలలు మళ్లీ పునఃప్రారంభం కానున్నాయని తెలిపారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్న భోజనం తినేలా వంటలు చేసి పెట్టాలని సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన మేరకు సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతి రోజూ మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. అనంతరం ఎండీఎం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష పెదగంట్యాడ సీఆర్పీలు, పీటీఐలు, డీటీఇవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కమ్యూనిస్టు కార్మిక సంఘాలతో కార్మికులు విసుగు చెందారని, అందులో భాగంగా అనేక మంది ఐఎన్‌టీయూసీలో చేరుతున్నారని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. మంగళవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద ఎస్సీఎం విభాగం మహిళా ఉద్యోగి రత్నశ్రీ ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆమెకు రాజశేఖర్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించగలిగే సత్తా ఐఎన్‌టీయూసీకి మాత్రమే ఉందన్నారు. రత్నశ్రీ మాట్లాడుతూ కార్మికులకు వేతన ఒప్పందం, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయగలిగే సత్తా ఐఎన్‌టీయూసీ ఉందని భావించి ఆ యూనియన్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, కొమ్ము ప్రసాద్, డి.మోహన్, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ.. వ్యక్తిత్వ వికాసం



చెస్ ఆడుతూ



యోగా చేస్తూ



కుర్చీల ఆట ఆడుతూ

పెదగంట్యాడ: గ్రంథాలయాల్లో చేపట్టిన వేసవి శిక్షణ శిబారాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతున్నాయి. గతంలో గ్రంథాలయాలు అంటే కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం ఈ గ్రంథాలయాలు విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఇందులో భాగంగానే విద్యార్థులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. మండలంలో శాఖా గ్రంథాలయాంలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8గంటల నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తున్న విజ్ఞాన తరగతులకు విద్యార్థులు తరలి వస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లీషు, లెక్కలు, క్రాఫ్ట్ కటింగ్, చదరంగం, క్యారమ్స్, డ్రాయింగ్, యోగా వంటి పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, పుస్తక పఠనం ఇలా అనేక అంశాలను నేర్పిస్తున్నారు. శిక్షణ సందర్భంగా విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ, కూల్ డ్రింక్స్ గ్రంథాలయ అధికారి పీవీ రమణ అందజేస్తున్నారు. శిక్షణ అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. గ్రంథాలయ అధికారి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఈ వేసవిలో విద్యార్థులు ఇంటి పట్టునే ఉంటూ సెల్‌ఫోన్‌లకు పరిమితం కాకుండా వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వేసిన డ్రాయింగ్స్‌తో

శానిటరీ ప్యాడ్స్‌పై అవగాహన

అగనంపూడి: రుతు క్రమంలో సురక్షితమైె ప్యాడ్‌లను వినియోగించాలని విజ్ఞాన్ కళాశాల కో ఆర్డినేటర్ మనోజ్ఞ అన్నారు. అంతర్జాతీయ రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సురక్షితమైన ప్యాడ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, ముఖ్యంగా బాలికలు రుతు క్రమంలో విధిగా సురక్షితమైన శానిటరీ ఉత్పత్తులను వాడడం వల్ల అనారోగ్యాల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



అగనంపూడి నిర్వాసిత కాలనీలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న నెల్లి శ్రీనివాసరావు

అగనంపూడి: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి సందర్భంగా మంగళవారం 85వ వార్డు నిర్వాసిత కాలనీలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి నెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 79వ వార్డు శనివాడ జాబిలీ హిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవానీ.. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏవీఎన్‌లో జాబ్ అచీవర్స్ డే



మాట్లాడుతున్న అతిథి

అల్లిపురం: మిసెస్ ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి వివిధ కంపెనీల ద్వారా ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సీఎంఈ, సివిల్ విభాగానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ బానోజీరావు, గౌరవ అతిథులుగా జోన్–4, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీహెచ్ సంతోష్‌కుమారి, ఏయూ ఫిజిక్స్ విభాగం హెచ్‌వోడీ ఆచార్య వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వెంకటేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

కుటుంబ వ్యవస్థకు రామాయణమే మూలం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: భారతీయ కుటుంబ వ్యవస్థ.. రామాయణం అనే అంశంపై మంగళవారం ప్రసంగ కార్యక్రమం జరిగింది. భారతీయ శిక్షణ్ మండల్ నిర్వహణలో స్థానిక బీవీకే కళాశాలలో చెరుకూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రధాన వక్తగా మాట్లాడారు. మన కుటుంబ వ్యవస్థ సమాజానికి బలమైన ప్రాకారమని, ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి వ్యవస్థ లేదని తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ కూడా అనుబంధాలు పతనమవుతున్నాయన్నారు. రామాయణం ప్రాచీన కుటుంబ వ్యవస్థకు మూలమని తెలిపారు. రామాయణంలోని అన్నదమ్ముల అనుబంధం సమాజానికి ఆదర్శమని, అయోధ్య, లంక, కిష్కింధల్లో భిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కొత్తూరు రమణ పాల్గొన్నారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'తో రక్షణ పొందండి



క్వార్టర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధాన సీసీ కెమెరా అమర్చుతున్న క్రైం పోలీసులు

ఉక్కునగరం: ఊరెళ్తున్నారా లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో రక్షణ పొందండని క్రైం పోలీసులు భరోసా ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11కు చెందిన ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో ఊరెళ్తూ స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సౌత్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ టి. రుక్మాంగదరావు నేతృత్వంలో ఆ క్వార్టర్‌కు వచ్చి సీసీ కెమెరాను అమర్చారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ తెరిచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇంట్లోని వ్యక్తులు పూర్తి వివరాలను పొందుపరిస్తే పోలీసులే మీ ఇంటికి వచ్చి సీసీ కెమెరాలను అమర్చుతారన్నారు. సీసీ కెమెరాను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించడం ద్వారా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని, సంబంధిత ఇళ్లలో అనుమానస్పద వ్యక్తులు ప్రవేశిస్తే కంట్రోల్ రూమ్‌లో అలారం కూడా మోగుతుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. తద్వారా దొంగల్ని పట్టుకునే అవకాశముందన్నారు. అదే విధంగా నగర ప్రజలు కూడా సీసీ కెమెరాలను అన్ని చోట్లా అమర్చుకుంటే నేరాలను అరికట్టవచ్చని ఆయన తెలిపారు.

కిశోర బాలికలకు సమతుల్య ఆహారం అవసరం



దేవాడ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్



ప్రదర్శనలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పెదగంట్యాడ: కిశోర బాలికలు ప్రోటీన్, ఐరన్‌లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని దేవాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రాజా సూచించారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ ఆరోగ్య కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం మానసిక మహోత్సవం పేరుతో రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. రుతుక్రమం జరిగే సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.అన్నపూర్ణ, బి.గోపాలం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలతో అనర్థాలు

ఆరోగ్యమే మహాభాగ్యం అ.ని ఏఎన్‌పాలెం అంగన్‌వాడీ టీచర్ కె.అబిదాబేగం అన్నారు. జీవీఎంసీ 77వ వారుడ ఏఎన్ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఎండీ సాహెబ్ పేట, అప్పికొండ, ఇస్లాంపేట, దాసరిపేట, మురభాయ్, మదీనాబాగ్, చాపలపాలెం, పలికలదొడ్డి అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి మంగళవారం రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూఢ నమ్మకాలతో అనర్థాలు వస్తాయన్నారు. నెలసరి సమయంలో తగిన పరిశుభ్రత పాటించడం చాలా ఉత్తమమన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ



పైడితల్లి అమ్మవారు



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

గాజువాక: స్థానిక పాత కర్నవానిపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దేవతామూర్తుల బళ్ల వేషాలు, కాళీమాత నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలువురు స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి అప్పారావు, కరణం కనకారావు, కరణం సురేష్, కరణంరెడ్డి రాము, గొంతిన దేముడు, మడగల కన్నయ్య, కరణం శ్రీను, సాలాపు నూకరాజు, జనపరెడ్డి మణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. రుతుక్రమ సమయంలో పరిశ్రుత పాటించకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో బాలికలు, మహిళలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

తాటి ముంజలకు గిరాకీ



తాటిముంజులు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

విశాఖ విద్య: ఎండల తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. వేడిగాలులతో బయటకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. రోజు వారీ పనుల్లో భాగంగా బయటకు వచ్చే ప్రజానీకం ఎండ నుంచి ఉపశమనం పొందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా వేసవిలో సమృద్ధిగా లభించే తాటిముంజులు తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఎమ్‌డీ సెంటర్‌లో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరానికి సమీపంలోని విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతంలో లభించే తాటికాయలను ఆటోల ద్వారా తీసుకొచ్చి కొంతమంది ఇక్కడ అమ్ముతున్నారు. డజను రూ.50కు లభిస్తుండటంతో కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది ఇళ్లకు సైతం తీసుకెళ్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 30 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 30 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం జువాలజీ, మ్యాథ్స్–2, హిస్టరీ పరీక్షలకు 386 మంది హాజరు కావాల్సి ఉండగా.. 16 మంది గైర్హాజరయ్యారన్నారు. వారిలో జువాలజీ పరీక్షకు 3, మ్యాథ్స్‌కు 12 మంది, హిస్టరీ పరీక్షకు ఒకరు హాజరు కాలేదని ఆయన తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలో 578 మందికి 564 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. వీరిలో జువాలజీ పరీక్షకు ముగ్గురు, మ్యాథ్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారన్నారు.